

నిధుల గోల్‌మాల్

వరదయ్యపాళెం మండలంలోని చిన్నపాం డూరు పీహెచ్‌సీ గ్రామీణ అలవెన్స్ నిధులు గోల్‌మాల్‌పై విచారణ చేపట్టారు. - 8లో



ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా ఆదేశించారు. - 8లో



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

విద్యార్థి దశ ఎంతో కీలకం



మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

గూడూరు రూరల్: జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు విద్యార్థి దశ ఎంతో కీలకమని రాజ్యసభ సభ్యులు, నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం యూత్ ఎంపవర్‌మెంట్ మోటివేషనల్ ప్రోగ్రాం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు విజయసాయిరెడ్డి ఫేస్ మాస్కులు ధరించి వినూత్నంగా ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్ ఉంటుందన్నారు. అన్ని భాషల్లో పట్టుండాలని, అప్పుడే ఏ రంగంలో అయినా రాణించవచ్చని చెప్పారు. ఇంజినీరింగ్ అయిపోయిన తరువాత ఉద్యోగ రంగంలో అయినా లేదా వ్యాపార రంగంలో అయినా మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం విజయసాయిరెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కళాశాల డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపల్ ధనుంజయ, ఏఓ రామయ్య, హెచ్‌ఓడీలు, పాల్గొన్నారు.

ప్రశాంతంగా హోంఓటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

శ్రీకాళహస్తి: జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలో జరుగుతున్న హోంఓటింగ్ ఎన్నికల సరళిని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు తాము ఇంటి వద్ద ఓటు వేస్తామని ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరూ ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం 1139 మంది ఓటర్లు ఉండగా.. అందులో సోమవారం ఒక్కరోజే 955 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్టు ఆయన వెల్లడించారు. మిగిలిన వారు కూడా ఇంటి వద్దనే ఓటు వేయవచ్చని చెప్పారు.



కత్తితో నరికి చంపుతారంట

ఆదిమూలం కుమారుడు సుమన్ తమను బెదిరిస్తున్నారంటూ టీడీపీ నేతలు కొందరు వీడియో ద్వారా మీడియాకు సమాచారం ఇచ్చారు. ఆదిమూలం అభ్యర్థిత్వం తమకు ఇష్టం లేక మౌనంగా ఉంటే.. తమను వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదిమూలం కుమారుడు సుమన్ తమను కత్తితో నరికి చంపుతానంటూ బెదిరిస్తున్నారని వీడియో విడుదల చేశారు. టీడీపీ నేతలు విడుదల చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదిలా ఉంటే.. మాజీ ఎమ్మెల్యే హేమలతను చులకన చేస్తూ మాట్లాడినట్లు ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యేకి ఓటు బ్యాంకింగ్ లేదని, ఇప్పుడు ఆమెను చూసి ఎవ్వరూ ఓటేసే పరిస్థితి లేదని హేమలత అనుచరులకు ఫోన్లు చేసినట్లు సత్యవేడులో టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. ఆమెకు ఓట్లు లేవని, హేమలత వచ్చినా తనకు ఏ మాత్రం ప్రయోజనం ఉండదని అనుచరుల వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. అదేవిధంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య పైన కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తన అనుచరుల వద్ద అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. 'వాళ్లను చూసి ఎవడు ఓట్లు వేస్తాడయ్యా.. మా కుటుంబాన్ని చూసే ఓట్లేస్తారు. వాళ్లు సపోర్ట్ చేసినా చెయ్యకపోయినా నాకు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు' అని స్పష్టం చేసినట్లు శ్రీకాళహస్తిలో టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

నిన్ను నమ్మం బాబూ!

కూటమి మేనిఫెస్టోతో ఉద్యోగుల్లో మార్పు కనిపించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. రెండు రోజులుగా సాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఉద్యోగులంతా వైఎస్సార్‌సీపీకి పూర్తి మద్దతు తెలియజేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38,870 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉంటే ఇందులో మొదటి రోజే భారీగా ఓటింగ్ నమోదైంది. ఇందులో ఎక్కువ శాతం ఓటర్లు వైఎస్సార్‌సీపీకే మొగ్గుచూపినట్లు చర్చ జరుగుతోంది.

- కూటమి మేనిఫెస్టోతో ఉద్యోగుల్లో ఆందోళన
- అభ్యర్థులకు షాక్ ఇస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళి
- ఆ భయంతో పల్లెల్లో ఓటర్లపై టీడీపీ నేతల ఫోకస్.. ప్రలోభాల ఎర
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులే లక్ష్యంగా కవ్వింపు చర్యలు
- సత్యవేడులో ఆదిమూలాన్ని నమ్మని టీడీపీ శ్రేణులు.. కొడుకు వార్నింగ్
- మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ, హేమలత, మునిరామయ్యపై అభ్యర్థుల ఆగ్రహం

సాక్షి, తిరుపతి: అలవికాని హామీలతో చంద్రబాబు జనాల్ని బురిడీ కొట్టించాలని చూస్తున్నారని ఉద్యోగులు నిర్ణయానికి వచ్చినట్లు ఓటింగ్ సరళిని చూస్తే అర్థం అవుతోంది. కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోని అమలు చేయాలంటే తమ జీతాల్లో కోత తప్పదని భావించి ఉద్యోగులు తమ ఓట్లను గంపగుత్తగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కి చమటలు పట్టిస్తోంది. ఉద్యోగులంతా తమకు మద్దతుగా నిలుస్తారు అనుకుంటే.. మొత్తం వ్యతిరేకమయ్యారని తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు కూటమి శ్రేణులు చర్చించుకుంటున్నారు. కూటమి నేతలు సూపర్ సిక్స్ పేరుతో ప్రవేశపెట్టిన పథకాల అమలు సాధ్యం కానివని ఉద్యోగులు తేల్చేశారు. వీటిని అమలు చేయాలంటే ఏడాదికి రూ.3 లక్షల కోట్లు అవసరం ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్న మాట. మొన్నటి వరకు చంద్రబాబు అండ్ కో చేసిన ప్రచారం (ఏపీ శ్రీలంక అవుతుంది) నిజం అవుతుందని స్పష్టం చేస్తున్నారు.

ఓట్ల కొనుగోళ్లపై కూటమి ఫోకస్



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పోలింగ్‌లో అనుకూలంగా లేకపోవడంతో కూటమి అభ్యర్థులు షాక్‌కు గురయ్యారు. దీంతో పల్లెలు, పట్టణాలు, నగరాల్లోని ఓటర్ల కొనుగోలుపై దృష్టి సారించారు. తిరుపతి నగరంలో కూటమి అభ్యర్థి తాను అక్రమంగా సంపాదించిన సొమ్ముతో కొందరు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినట్లు ప్రచారం జరుగుతోంది. నగరంలో ఇద్దరు కార్పొరేటర్లను భారీగా నగదు, బంగారం ఆభరణాలు ఇచ్చి కొనుగోలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మరికొందరు కార్పొరేటర్ల కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇకపోతే ఎన్నికల సమయంలో తమకు అనుకూలంగా ఉండేందుకు కొందరు అధికారులను రోజూ మద్యం బార్లకు తీసుకెళ్లి బేరసారాలు ఆడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మద్యం బార్లలో కుదిరిన బేరంతో కొందరు అధికారులు నగదు, బంగారు ఆభరణాలు తీసుకొస్తుండగా తోటి సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉంటే.. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో బొజ్జల అనుచరులు వాట్సాప్ కాల్ చేసి బెదిరింపులకు గురిచేస్తున్నారు. కుటుంబ యజమాని ఫోన్ తియ్యకపోతే.. ఆ గ్రామాల్లో ఉన్న అనుచరుల ద్వారా బంధువులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఇది ఒక్క శ్రీకాళహస్తిలోనే కాదు.. కుప్పం నుంచి గూడూరు వరకు నిత్యం గ్రామాల్లో జరుగుతున్న తంతు. కూటమి అభ్యర్థుల మాట వినకపోతే వారితో గొడవలకు దిగి ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో చిచ్చుపెడుతున్నారు.

రెండో రోజు 86.66 శాతం పోలింగ్



తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. రెండో రోజు అయిన సోమవారం 86.66శాతం నమోదైనట్టు జిల్లా ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు మరో రెండు రోజులు అవకాశం ఉండడంతో వంద శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 22,299 ఉండగా.. ఇప్పటివరకు 19,508 ఓట్లు పోలయ్యాయని తెలిపారు.

ఓటింగ్ సరళి పరిశీలన

పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. సోమవారం ఆయన తిరుపతి,చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆయా నియోజకవర్గాల్లో ఈవీఎంలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మరో అవకాశం

సార్వత్రిక ఎన్నికల డ్యూటీలోని ఉద్యోగులకు మే1వ తేదీలోపు ఫారం–12ను సమర్పించలేకపోయిన వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి మంగళ, బుధవారాలు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి కేటాయించిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శ్రీకాళహస్తి : స్కిట్ కళాశాలలోని ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

9న క్రికెట్ సెలెక్షన్స్

తిరుపతి రూరల్: చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్, అండర్ –19 క్రికెట్ సెలెక్షన్స్ చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 9వ తేదీన తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట వైఎస్‌ఆర్ గ్రౌండ్స్ వేదికగా ఈ సెలెక్షన్స్ ఉంటాయన్నారు. 2024–25కి గాను చేపట్టే సీనియర్స్ జట్టుకు వయోపరిమితి లేదన్నారు. అండర్ –19కు మాత్రం 2005 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2010 సెప్టెంబర్ 1 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. అండర్ – 19 వారు ఉదయం 8 గంటలకు హాజరు కావాలన్నారు. సీనియర్స్ మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలని సూచించారు. క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితో రావాలని కోరారు. తమ వెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం (ఫామ్ –5) తీసుకురావాలన్నారు. వివరాలకు మురుగన్ 9849026131, చినబాబు 7981880381ను సంప్రదించాలని సూచించారు.

తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం



కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న టీడీపీ కార్యకర్తలు

శ్రీకాళహస్తి: స్కిట్ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ సమయంలో తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇండిపెండెంట్లకు సంబంధించిన ఏజెంట్ ఫారాలు దక్కించుకుని పదేపదే టీడీపీ నాయకులు లోపలికి, బయటకు రావడం విమర్శలకు తావిస్తోంది. దీనికితోడు పసుపు గొడుగులు పట్టుకుని, పసుపు కండువాలు ధరించి వైఎస్సార్ సీపీ శిబిరం వద్దకు వచ్చి ప్రచారం చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు కల్పించుకుని టీడీపీ వారిని మందలించి శిబిరాల వద్దకెళ్లి ప్రచారం చేసుకోవాలని సూచించారు. అయినా వినకపోవడంతో సీఐ అజయ్ కల్పించుకుని కేసులు పెడతామని హెచ్చరించడంతో మిన్నకుండిపోయారు.

- ఆశీర్వదించండి.. అండగా ఉంటాం
- బీసీల ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మేరిగ, నేదురుమల్లి, గురుమూర్తి పిలుపు

మీ నమ్మకాన్ని నిలబెడతాం!





వెంకటగిరి : బీసీ సదస్సుకు హాజరైన జనం, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి గురుమూర్తి

వెంకటగిరి(సైదాపురం): 'ఎమ్మెల్యే, ఎంపీగా తమను గెలిపించండి.. మీ నమ్మకాన్ని నిలబెడతాం.. మీకు వెన్నంటూ ఉంటూ సేవ చేస్తాం' అని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఎం.గురుమూర్తి స్పష్టం చేశారు. వెంకటగిరిలోని ఎస్‌జేఆర్ భవనంలో ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బీసీ ఆత్మీయ సభలో వారు మాట్లాడుతూ మీకు సేవ చేయడానికే రాజకీయ రంగప్రవేశం చేశానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. గత 40 ఏళ్లుగా వెంకటగిరి నియోజకవర్గ ప్రజలతో నేదురుమల్లి కుటుంబానికి అనుబంధం ఉందని, ఐదేళ్లకు ఒకసారి వచ్చిపోయే రకం కాదని చెప్పారు. మీ కుటుంబ సభ్యుడిగా..మీలో ఒకరిగా వ్యవహరిస్తామన్నారు. ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటామని తెలిపారు. బాధ్యతగా.. నిజాయితీగా పనిచేస్తామని.. ఆశీర్వదించాలని ఆయన కోరారు. బీసీలకు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలంతా ఏకమై వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా కృషిచేయాలని పిలుపునిచ్చారు.

66 శాతం నిధులు బీసీలకే

రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇందులో భాగంగా నిధులు కూడా 66 శాతం బీసీలకు కేటాయించారని తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీ సంక్షేమానికి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారికి పదవుల్లో కూడా సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు. గతంలో బీసీలంటేనే ఎన్నికల్లో వాడుకోవడం...వదిలేయడం మాత్రమేనని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బీసీ సంక్షేమానికి అహర్నిశలు కృషిచేస్తున్నట్లు తెలిపారు. నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలుపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, ఎంపీ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ పోతుల సునీత, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సురేంద్ర, నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనంజయ్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొలిగర్ల మస్తాన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతు శారద, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాడా జానకీరామయ్య, నాయకులు దొంతు బాలకృష్ణ, సైదాపురం మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కూటమి హామీలు బూటకం



చిన్నగొట్టిగల్లు : ఎన్నికల ప్రచారంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప

భాకరాపేట : కూటమి మేనిఫెస్టో అంతా బూటకమని, దాన్ని నమ్మి ఓట్లేస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోవడం గ్యారంటీ అని చిత్తూరు ఎంపీ అభ్యర్థి ఎన్. రెడ్డెప్ప తెలిపారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నగొట్టిగల్లు ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమిని రాష్ట్ర ప్రజలు స్వీకరించడం లేదన్నారు. ఇప్పటి వరకు చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఇప్పుడు ఎన్ని జెండాలు జత కట్టినా జగనన్న అజెండా మాత్రం పేదల సంక్షేమమేనన్నారు. చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేయకుండా వారిని నిలువునా ముంచేశారని గుర్తుచేశారు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేసినట్టు తెలిపారు. అందుకే ప్రజల సంపూర్ణ మద్దతు జగనన్నకే ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖదీర్‌అహ్మద్, సర్పంచ్ మనోహర్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బావాజీ, పార్టీ నాయకులు ఇర్షాద్, షాబ్‌జాన్, శివ, భాస్కర్, రియాజ్ పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీలకు సముచిత స్థానం





గూడూరురూరల్: మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్(ఇన్‌సెట్) బీసీల ఆత్మీయ సమ్మేళనంలో ఐక్యత చాటుతున్న బీసీ వర్గాల నాయకులు

గూడూరురూరల్ : జగనన్నతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని, ఈనెల 13న జరిగే ఎన్నికల్లో బీసీలందరూ వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంగా ఆశీర్వదించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని సాయినగర్‌లో ఏర్పాటైన పీవీఆర్ కల్యాణ మండపంలో సోమవారం జయహో బీసీల ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా సాగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ నాయకులు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా బీసీలకు న్యాయం జరగలేదని, కేవలం సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే బీసీలను గుర్తించి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేసిన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌ను, తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు మాట్లాడుతూ ప్రతిపక్షాలు విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నాయని, వారు చెప్పే మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దని హితవు పలికారు. బడుగు, బలహీనవర్గాలను అక్కున చేర్చుకున్న జగనన్నకు ఇంకో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చేవూరు విజయమోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాసిన నాగులు, దేవరాల సుబ్రమణ్యం, తాళ్లూరు శ్రీనివాసులు, బాలిబోయిన రమేష్, మండ్ల సురేష్‌బాబు, ట్రేడ్ యూనియన్ నాయకులు రాజారెడ్డి, రాజేష్‌కుమార్, మెబీన్‌బాషా, ప్రసాద్‌గౌడ్, గురుస్వామి, రాజేష్ యాదవ్, కటికాల శేషగిరి, రమేష్ యాదవ్, కోదండరామయ్య, షంషీర్, సాయి పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

- బీసీ ఆత్మీయ సదస్సులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఎంపీ బీద మస్తాన్‌రావు వెల్లడి



ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి, ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని గెలిపించాలని కోరుతున్న బీద మస్తాన్‌రావు

వెంకటగిరి(సైదాపురం): సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఎంపీ బీద మస్తాన్‌రావు స్పష్టం చేశారు. సోమవారం చిత్తూరు జిల్లా, వెంకటగిరి పట్టణంలోని ఎస్‌జేఆర్ భవనంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ సదస్సులో వారు పాల్గొని ప్రసంగించారు. బీసీ సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో నాడు–నేడు, అమ్మఒడి, జనన్న గోరుముద్ద, ఇంగ్లిషు మీడియం చదువులు ప్రవేశ పెట్టి పేదల తలరాతలు మార్చుతున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టేవారికి ఓటర్లు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాను 32 ఏళ్లపాటు టీడీపీలో ఉన్నా తనకు ఏనాడూ ప్రాతినిధ్యం ఉన్న పదవికూడా ఇవ్వకుండా మోసం చేశారని ఎంపీ బీద మస్తాన్ రావు గుర్తుచేశారు. మచ్చలేని నేత, మంచివాడు వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమర్‌రెడ్డిని, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సురేంద్ర, బీసీ నేత డాక్టర్ మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ బీసీలను వెన్నుపోటు పొడిచే పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



నాగలాపురం: తండ్రితో కలిసి బైక్‌పై రోడ్డు క్రాస్ చేస్తుండగా స్కార్పియో బలంగా ఢీకొనడంతో కొడుకు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. బైటకొడియంబేడు గ్రామానికి చెందిన బాలాజీ తన కుమారుడు ప్రసాద్ (12)తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. గ్రామం నుంచి మెయిన్ రోడ్డుకొచ్చే సమయంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా పుత్తూరు వైపు వెళ్తున్న స్కార్పియో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చొని ఉన్న ప్రసాద్ ఎగిరి పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి బాలాజీకి స్వల్ప గాయలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పెద్దిరెడ్డి వెంటే పయనం

- వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం
- సమష్టిగా పనిచేస్తాం
- అఖండ మెజారిటీ తీసుకువస్తాం
- బలిజల సంఘటిత ప్రమాణం



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో ప్రమాణం చేస్తున్న బలిజ కులస్తులు

పుంగనూరు : పుంగనూరు నియోజకవర్గంలోని బలిజ సామాజిక వర్గం సంఘటితమైంది. తమ అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీకి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపింది. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు ఫ్యాను గుర్తుకే ఓట్లు వేస్తామని, అందరితో వేయిస్తామని ముక్తకంఠంతో ప్రమాణం చేసింది. సోమవారం పట్టణంలో మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డిని రాష్ట్ర జానపదకళల సంస్థ అధ్యక్షుడు కొండవీటి నాగముని, నాగభూషణం, నాగేంద్ర, బలిజ సంఘ నేతలు నానబాల గణేష్, పూలత్యాగరాజు, రాయల జగదీష్, తుంగామంజునాథ్ , సుబ్రమణ్యం కలిశారు. బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశానికి తీసుకెళ్లారు. సంఘం అధ్యక్షుడు నాన బాలగణేష్ మాట్లాడుతూ బలిజల కోసం మంత్రి పెద్దిరెడ్డి విశేషంగా కృషి చేశారన్నారు. కమ్యూనిటి భవనానికి నిధులు మంజూరు చేశారని, భీమగానిపల్లె వద్ద శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ ఏర్పాటు చేశారని, బలిజల హాస్టల్‌కు స్థలం అందించారని వివరించారు. మంత్రి పెద్దిరెడ్డి సహకారంపై బలిజలందరూ సంతృప్తిగా ఉన్నామన్నారు. ఎన్నికల్లో బలిజలు ఐకమత్యంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికే ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు వారి కులదైవం సాక్షిగా ప్రమాణాలు చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ బలిజ కులస్తులను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వారిని రాజకీయంగా , ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. సమావేశంలో బలిజ కులస్తులు సీడీ కృష్ణప్ప, నాన బాలమణి, సుబ్రమణ్యం, నటరాజా, రామచంద్ర, కేశవమూర్తి, ప్రభాకర్, ఆదినారాయణ, ఎస్వీటీ కిషోర్, సోము, రెడ్డెమ్మ, సుబ్బరాయప్ప, రవి, గోపి, సాగర్, సురేష్, రామకృష్ణ, భారతి, మురళి, కొండవీటి నరేష్, మాధురి పాల్గొన్నారు.

రఘుపతి సేవలు మరువలేం



రఘుపతి నాయుడు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె : వైఎస్సార్‌సీపీకి నిస్వార్థంగా చిత్తశుద్ధితో పనిచేసిన రఘుపతినాయుడు సేవలు మరువలేమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. టీడీపీ గూండాల దాడిలో కన్నుమూసిన రఘుపతి నాయుడు భౌతికకాయానికి ఆయన ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఈమేరకు బోయకొండ క్రాస్ వద్ద రఘుపతి నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ దిగువపల్లె పంచాయతీలో కీలకంగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి రఘుపతి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురయ్యారు. రఘుపతి కుటుంబసభ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం పచ్చ మూకల రాళ్లదాడిలో తీవ్రంగా గాయపడిన మోహన్‌తోపాటు లద్దూరమణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అశ్రునయాల నడుమ రఘుపతినాయుడుకు కన్నీటి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, నేతలు మిద్దింటి కిషోర్‌బాబు, రాజేష్, రమేష్‌బాబు, చిన్నప్ప, గిరిబాబు, తిమ్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కురుగుండ్ల అరాచకాలు!



గోతాల రామకృష్ణ.. ఈ పేరు వింటే నాయుడుపేట వాసులకు ఎప్పుడో.. ఎక్కడో పాత రోజులు గుర్తుకు వస్తాయి. ప్రస్తుత వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ 1990వ సంవత్సరంలో నాయుడుపేటలో రెండో రకం గోతాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. తన బంధువుల ఇచ్చిన ఆర్థిక సహకారంతో ఓ లారీని కొనుగోలు చేసి అక్రమ రవాణాకు బీజం వేశారు. ఆపై వందల లారీలు కొనుగోలు చేసి తన చీకటి సామ్రాజ్యాన్ని విస్తరించారు. 2014 నుంచి 2019 వరకు తన చీకటి వ్యాపారం అడ్డూ అదుపూ లేకుండా సాగింది. అడ్డొచ్చిన అధికారులపై చిందులేయడం.. వారి కార్యాలయాలకే వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఇంకా ఆయన ఏమేమి చేశాడో.. అవినీతి సామ్రాజ్యాన్ని ఎలా విస్తరించారో మీరు చదవండి..!

- తన లారీలతో ఇబ్బడిముబ్బడిగా అక్రమ వ్యాపారం
- జీరోదందాతో నడిపేస్తున్న వైనం
- అడ్డొస్తే అంతే సంగతులు

సాక్షి, నెట్‌వర్క్: వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ దందా అంతాఇంతా కాదు. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే తన అవినీతి సామ్రాజ్యాన్ని మరింత విస్తరించారు. తన లారీలను నిత్యం జీరోదందా (ట్యాక్స్ చెల్లించకుండా సరుకుల అక్రమరవాణా)తో నడిపేవారు. చెన్నై స్థావరంగా చేసుకుని ఈ క్రమ వ్యాపారాన్ని సాగించేవారు. ఈయన పేరు చైన్నై నుంచి హైదరాబాద్ వరకు జాక్‌పాట్ రామకృష్ణ అని పిలుస్తుండేవారు. ఆయనకు సంబంధించిన లారీలను రూట్‌లో ఎవరూ అడ్డగించేవారు కాదు. ఎవరైనా అడ్డగిస్తే నేరుగా వారి కార్యాలయాలకే వెళ్లి హల్‌చల్ చేసేవారు. 1990 ఆరంభంలో చేతిలో చిల్లగవ్వ లేని రామకృష్ణ అనతికాలంలోనే కోటీశ్వరుడిగా మారిపోయారు. తన చీకటి సామ్రాజ్యాన్ని చెన్నై నుంచి విజయవాడ వరకు విస్తరించారు.

దందా.. రామకృష్ణ పంథా

నాయుడుపేటలో 90వ దశకంలో రెండో రకం గోతాలు అమ్ముకుంటున్న కురుగొండ్ల రామకృష్ణ తన బంధువులు ఇచ్చిన ఆర్థిక సహకారంతో ఓ లారీని కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఆంధ్ర నుంచి చెన్నైకి ధాన్యాన్ని అక్రమంగా రవాణా చేయడం ప్రారంభించారు. ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు లారీలుగా వర్ధిల్లింది. దీంతో ఆయన తన అక్రమ దందాను మరింత విస్తరించి యథేచ్ఛగా కొనసాగించడం ప్రారంభించారు. రామకృష్ణపై 1991లో సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నం.12–91 నమోదైంది. అప్పట్లో ధాన్యం అక్రమ రవాణాను అడ్డుకున్న నాయుడుపేట మండల రెవెన్యూ అధికారి షంషేర్ అహ్మద్‌పై దౌర్జన్యాకి ఒడిగట్టడం వివాదాస్పదమైంది. రామకృష్ణ సంఘవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అప్పట్లో జిల్లా ఉన్నతాధికారులు పీడీ యాక్ట్ అమలు చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పటి రాపూరు ఎమ్మెల్యే నువ్వుల వెంకటరత్నం నాయుడు చలువతో ఆ కేసు లేకుండా రామకృష్ణ బయటపడగలిగారు. ఎస్‌ఆర్ఎల్‌టీ పేరుతో నేటికీ ఆ లారీలు జీరోదందా తంతును కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. గుట్కా, పాన్‌పరాగ్‌లు వంటి స్మగ్లింగ్ కార్యక్రమాలు రామకృష్ణ తన లారీల ద్వారా ఎగుమతి చేస్తుంటారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బెంగళూరు నుంచి హైదరాబాద్, చెన్నై నుంచి హైదరాబాద్‌కు ఎటువంటి పన్నులు చెల్లించకుండానే తన లారీలు తిప్పుతున్నట్టు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

ఫ్యాను హోరు..

నేతల హుషారు



తిరుపతి రూరల్ : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ఏర్పేడు: జిల్లాలో ఫ్యాను హోరు పెంచింది. నేతలను హుషారులో ముంచెత్తుతోంది. కూటమి నేతలకు వణుకు పుట్టేలా చేస్తోంది. సోమవారం ఏర్పేడు మండలంలోని మర్రిమంద గ్రామానికి చెందిన 50 మంది ముస్లింలు, టీడీపీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షబీనా, షాహియా, ముంతాజ్, మోతీ, గుల్షన్, మదర్‌బీ, పార్విజాన్, రజియా, వసంతమ్మ, దిల్‌షాద్, మములాబి, జహీతా, హసీనా, హజీరా, షాహినా, ముంతాజ్, గిస్‌బీ, రజియా, హదీష్, షాంషాద్, ఫార్విన్, పాతిమా, ఉమాదేవి, షకీరా తదితర 50 మంది ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగరాజురెడ్డి, పార్టీ నాయకులు షేక్ మస్తాన్, చంద్రశేఖర్, సుధీర్‌కుమార్, ఈశ్వర్, గోపీ రాయల్, బాలకృష్ణ, మణి తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో 20 కుటుంబాలు చేరిక



సైదాపురం : పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

సైదాపురం: నియోజకవర్గంలోని సైదాపురం మండలం, తిప్పిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పీ.పుల్లయ్య ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో దారా పాపయ్య, కుమ్మరిగుంట రమణయ్య, గంపాల ఈశ్వరయ్య, అడసపల్లి చిన్న మీరయ్య, లేబాకు వెంకటయ్య, పందుల శ్రీను, వరికూటి చిన్నబ్బాయ్య, సుబ్రమణ్యం, పందుల శ్రీకాంత్, పందుల సుబ్రమణ్యం, వరికూటి హనుమంతయ్య తదితరులు ఉన్నారు. సోసైటీ అధ్యక్షుడు శివకుమార్, మాజీ సోసైటీ అధ్యక్షుడు కే.మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, శివ, అనిల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కోట: కోట మండలం, ఉత్తమనెల్లూరుకు చెందిన టీడీపీ నాయకుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, కర్లపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దువ్వూరు మోహన్‌రెడ్డి తమ అనుచరులతో కలసి సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

తిరుపతి రూరల్‌లో టీడీపీకి ఎదురుగాలి

తిరుపతి రూరల్: మండలంలో టీడీపీ, జనసేన కలగలిసిన కూటమికి వ్యతిరేక గాలులు వీస్తున్నాయి. ఆ పార్టీ నేతలకు భారీ షాక్ ఇస్తూ పెద్ద ఎత్తున యువత వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరికల పరంపర కొనసాగుతోంది. తిరుపతి రూరల్ మండలం, ఓటేరు పంచాయితీకి చెందిన 30 మంది తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్‌ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పిన సాదరంగా పార్టీలోకి స్వాగతించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి తమవంతు సహకరిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గురుమూర్తి, శ్రీనివాసులు, శశికుమార్, సాయికుమార్, బద్రి, హరి, సద్దామ్, శ్రీను, చోటసాయి, రవి చంద్ర, కార్తిక్, భాను, మనోహర్, ధనశేఖర్, లోకేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీరాజా, మహేష్, మోహన్, పురుషోత్తం, కార్తీక్, ఆర్ముగం, మురగ, గోవిందరెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆరణిని అనర్హుడిగా ప్రకటించండి



వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు

తిరుపతి లీగల్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన జనసేన పార్టీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును అనర్హుడిగా ప్రకటించాలని అధికారులకు ఫిర్యాదుచేసినట్టు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు మునిబాల సుబ్రమణ్యం (దొరబాబు) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత శుక్రవారం ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి తిరుపతి సంజయ్ గాంధీ కాలనీలోని మదీనా మసీదులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన జనసేన పార్టీ కార్యకర్తలపైన చర్యలు తీసుకోవాలని ఆదేశించాలని, అలాగే తన కార్యకర్తలను ఇందుకు ప్రోత్సహించి, ప్రేరేపించిన ఆ పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును ఎన్నికల్లో పోటీనుంచి తప్పించి అనర్హుడిగా ప్రకటించాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు దొరబాబు తెలిపారు. ఆరణి శ్రీనివాసులు చేస్తున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాలు రోజు రోజుకీ శ్రుతి మించుతున్నాయని దొరబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈమేరకు తాను తిరుపతి శాసనసభ రిటర్నింగ్ అధికారిణికి, జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశానని ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ అలవెన్స్ నిధులు గోల్‌మాల్

- డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో విచారణ
- ప్రధాన వైద్యాధికారిణి డీడీఓ బాధ్యతల నుంచి తొలగింపు !



పాండూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి లావణ్యను విచారిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరిరావు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత కొంతకాలంగా నిధుల దుర్వినియోగం రగడ చినికిచినికి గాలివానగా మారింది. ఈ వ్యవహారం కాస్త జిల్లా వైద్యాధికారి శ్రీహరిరావు చెవిలో పడడంతో సోమవారం విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా.. ఆస్పత్రి యూడీసీ ప్రమేయం లేకుండా ప్రధాన వైద్యాధికారిణి లావణ్య గ్రామీణ అలవెన్స్‌కు సంబంధించి ఇష్టానుసారంగా బిల్లులు పెట్టారు. ఈ నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి ఆమెను జిల్లా వైద్యాధికారి విచారణ చేపట్టారు. విచారణలో గోల్‌మాల్ జరిగినట్లు తేలడంతో మరోమారు పూర్తి స్థాయిలో విచారించేందుకు ఆయన ఆదేశించారు. అయితే ఆమెను డీడీఓ బాధ్యల నుంచి తొలగించనున్న ట్లు సమాచారం. ఆస్పత్రిలో మరో వైద్యురాలు అనిత, యూడీసీ సోమశేఖర్‌ను కూడా విచారించినట్లు తెలుస్తోంది.

గంజాయి కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

గూడూరురూరల్: గంజాయి కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం నెల్లూరులోని 1వ ఏడీజే కోర్టు తీర్పునిచ్చిందని గూడూరు ఎస్‌ఈబీ సీఐ రమేష్ తెలిపారు. గత ఏడాది గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్‌లో జయదీప్ అనే వ్యక్తి వద్ద 1.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో అతనిపై సెబ్ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎస్‌ఈబీ ఎస్‌ఐ శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, ఏపీపీ రమణారెడ్డి వాదనలు వినిపించినట్లు వెల్లడించారు.

ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

తిరుపతి అర్బన్: జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సార్వత్రిక ఎన్నికల రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పోలీసులు విధులు నిర్వహించాలని చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2140 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 8 చోట్ల అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, 6 అంతర్ జిల్లాల చెక్ పోస్టులు, ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు 2 ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ ఇప్పటివరకు మొత్తం రూ.20.28 కోట్ల విలువైన వాటిని సీజ్ చేసినట్టు వెల్లడించారు.